
భూమి స్వభావాన్ని బట్టి పంటల సాగు

» పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ పుష్పావతి

6



అంతర్మథనం

బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు లేదా విలీనంపై చర్చనీయంగా గువ్వల వ్యాఖ్యలు

» ఏ పార్టీతో పొత్తు ఉన్నా తాను కేటీఆర్ వెంటేనని మర్రి నర్మగర్భ ప్రకటన
» అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ఎవరెవరు ఏం ఆశిస్తారనే దాక ఊహాగానాలు
» మరికొంతమంది నేతలు బీజేపీవైపు వెళ్లే అవకాశమున్నట్లు జోరుగా ప్రచారం
» కొన్ని నియోజకవర్గాల్లో బలంగా బీజేపీ నాయకులు, ఎన్నికల్లో ప్రధాన పోటీ


మహబూబ్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాజకీయాల్లో మార్పులు చాలా వేగంగా జరుగుతుంటాయి. ఒక్క చిన్న పరిణామం ఎంతోమంది నేతలను అంతర్మథనంలోకి నెట్టివేస్తుంది. దాని చుట్టూనే వారు ఆలోచించేలా ప్రేరేపిస్తుంది. రాజకీయాల్లో ఇది జరగదు అనేది ఉండదు. ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న చర్చ కూడా అందులో భాగమే. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం, ఆ సందర్భంలో, ఆ తర్వాత చేసిన పలు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నం జరిగిందని ఇప్పటికే ఒకసారి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ప్రస్తావించడం, ఎంపీ సీఎం రమేష్ తనను కలిసిన కేటీఆర్ పొత్తుపై మాట్లాడారని ప్రకటించడం, తాజాగా గువ్వల వ్యాఖ్యలు, నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సైతం ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా తాను కేటీఆర్ వెంటే ఉంటానని నర్మగర్భంగా పొత్తుపై స్పందించడం వంటివన్నీ చర్చను, నేతల్లో ఒకరకమైన ఆలోచనను రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి విలీనం మాటలు, పొత్తులు పెట్టుకోవడం ఇదే మొదటిసారి కాదు. 2004లో కాంగ్రెస్‌తో, 2009లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నది. తెలంగాణ ఏర్పాటు సమయంలో కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా అడుగులు కూడా వేసింది. ఇవన్నీ కారణాల నేపథ్యంలో కొందరు పొత్తు లేదా విలీనం ప్రస్తుతం ఉన్న గడ్డు పరిస్థితుల్లో ఉండొచ్చని భావిస్తుండగా మరికొందరు మాత్రం అసలు ఆ ప్రస్తావనే ఉండదంటున్నారు. ఇంకొందరు విలీనమనే మాట ఉండదని, ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన మాదిరిగా కూటమిగా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులో ప్రధానంగా చర్చ జరుగుతోంది.



అప్పుడే బలాబలాలపై చర్చ..

ఈ పొత్తు ప్రస్తావన తరచూ వస్తుండటంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొందరు నేతలు, సాధారణ ప్రజలు బలాబలాలపై అప్పుడే చర్చ కూడా చేస్తున్నారు. ఇలా జరిగితే అలా జరుగుతుంది. అలా జరిగితే ఇలా జరుగుతుంది అంటూ గుసగుసలాడుతున్నారు. గువ్వల బాలరాజు రాజీనామాతో కొందరు మాజీ మంత్రి రాములు బీఆర్ఎస్‌లోకి వస్తారని అంటుండగా ఇంకొందరు ఆయన బీజేపీలోనే ఉంటారని, ఒకరు ఎమ్మెల్యేగా, మరొకరు ఎంపీగా పోటీచేస్తారని అంటున్నారు. అలా ఉంటే బీఆర్ఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అచ్చంపేట నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తుందనే చర్చ నడుస్తోంది. పొత్తు కుదిరితే అచ్చంపేటలో గందరగోళం ఏర్పడే అవకాశం కచ్చితంగా కనిపిస్తోంది. కొల్లాపూర్‌లో ఇప్పటికే బీరం తాను పార్టీ మారబోనని స్పష్టం చేశారు. అయితే ఇక్కడ ఎల్లేని సుధాకర్‌రావు రెండు టర్మ్‌లుగా బీజేపీ నుంచి పోటీ

(మిగతా 6లో..)



కారు స్టీరింగ్ ఎవరికో?

» పరిశీలనలో మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్‌ల పేర్లు
» క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం కావడానికి పల్లె యాత్ర
» బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అధిష్ఠానం దిశా నిర్దేశం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్న క్రమంలో ఆ పార్టీ అధిష్ఠానం దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. జిల్లాలో బలమైన నాయకులకు అధ్యక్ష బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించింది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీనీ వీడి బీజేపీలో చేరనున్న క్రమంలో బీఆర్ఎస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది.

పరిశీలనలో మాజీ ఎమ్మెల్యేల పేర్లు

జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న గువ్వల బాలరాజు పార్టీ మారాలని నిర్ణయించిన క్రమంలో అధ్యక్ష బాధ్యతలు ఎవరికీ కేటాయించాలనే అంశంపై బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టిని కేంద్రీకరించింది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్‌ల పేర్లు ప్రస్తావనకు వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పదవి ఓసీలకు రిజర్వ్ అయితే మర్రి జనార్దన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని, బీసీలకు రిజర్వ్ అయితే జైపాల్‌యాదవ్‌కు అవకాశం కల్పించాలని ఇప్పటికే పార్టీ అధిష్ఠానం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరిలో ప్రధానమైన పదవిని ఇచ్చి సంస్థాగతంగా బలోపేతం కావాలనుకుంటున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారైన తర్వాతనే బీఆర్ఎస్‌కు జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించాలనే యోచనలో బీఆర్ఎస్ ఉంది.



త్వరలోనే పల్లె యాత్ర

స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకుని రాబోయే సాధారణ ఎన్నికల్లో గెలుపొందాలని బీఆర్ఎస్ ముఖ్య నాయకత్వం యోచిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిలకు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆ ప్రభావం కచ్చితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలపై చూపిస్తుంది. అధినాయకత్వ సూచనల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్‌లు వ్యూహాత్మక పోకడలకు శ్రీకారం చుట్టడం గమనార్హం. బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు అచ్చంపేటకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన గువ్వల బాలరాజు బీజేపీలో చేరనున్న క్రమంలో అక్కడ బలమైన నాయకత్వాన్ని రంగంలోకి దించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగారు. గువ్వల బాలరాజు బీజేపీలో చేరేకంటే ముందే బీఆర్ఎస్‌కు సంబంధించి అచ్చంపేట జనానికి బాగా టచ్‌లో ఉన్న నేతకు బాధ్యతలను అప్పజెప్పే అవకాశాలున్నాయని జోరుగా ప్రచారం జరుగుతోంది.

చేనేతకు చెదరని ఆదరణ

» టెంపుల్ బార్డర్ నారాయణ పేట ప్రత్యేకం
» పట్టు చీరలకు పెట్టింది పేరు గద్వాల
» మగువల మనసు దోచే నేత వస్త్రాలు
» నేడు జాతీయ చేనేత దినోత్సవం



గద్వాల జరీ చీరలను తయారు చేస్తున్న కార్మికులు

7

టోల్‌ప్లాజా కార్మికులకు బోనస్ ఎగవేత

» ఉద్యోగులు, యాజమాన్యం మధ్య వివాదం
» పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు

7

మహిళ అనుమానాస్పద మృతి

» కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామంలో ఘటన

కృష్ణ, గోదావరి నదీ జలాలు తెలంగాణకు దక్కకుండా కుట్ర

» మాజీ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి

7

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి



వైద్యులు అందుబాటులో ఉండాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



బిజినేపల్లి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బిజినేపల్లి ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఎన్ని డెలివరీలు, వైద్య పరీక్షలు చేశారని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా నిరుపేదలు వస్తుంటారని, వారికి 24 గంటలు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం పీఏసీఎస్ గోదాంలోని ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు నిల్వ ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీఏవో యశ్వంత్ రావు, ఇన్‌చార్జీ ఏవో కమల్ కుమార్, సీఈవో రవీందర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెడికల్ అసోసియేషన్ ఏజెన్సీ తనిఖీ

» 15 రోజుల పాటు సస్పెండ్ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

6

వ్యక్తి దారుణ హత్య

- పందుల పెంపకందారుల మధ్య ఘర్షణ
- తీవ్రంగా గాయపడిన మరో నలుగురు

వెల్దండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో బుధవారం రాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి పట్టణానికి చెందిన బెల్లంకొండ రాములు, రాంచంద్రయ్య, నిరంజన్, అంజిలు పెంచుతున్న 12 పందులు ఇటీవల చోరీకి గురయ్యాయి. బాధితులు వెతుకుతున్న సందర్భంలో వెల్దండ సమీపంలోని లక్ష్మపురం చెరువు వద్ద మానుపాటి వెంకటమ్మ వ్యవసాయ పొలంలో కనిపించాయి. ఈ విషయంపై కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం 12 పందులను తీసుకెళ్తేందుకు కల్వకుర్తికి చెందిన ఆ నలుగురు వెంకటమ్మ వ్యవసాయ పొలం వద్దకు వచ్చారు. వెంకటమ్మకు, రాములుకు మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. వెంకటమ్మ కుమారులు అన్వేష్, పవన్, శివలు కల్వకుర్తి నుంచి వచ్చిన వారిపై కర్రలు, కత్తులతో దాడిచేశారు. దీంతో రాములు(40) తీవ్రంగా గాయపడ్డారు. రాములును బొలేరో వాహనంలో కల్వకుర్తికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. ఘర్షణలో వెంకటమ్మతో పాటు రాంచంద్రయ్య, నిరంజన్, అంజిలు గాయపడ్డారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



రాములు (ఫైల్)

బడి బయటనే బాలికలు

- పత్తి సీజన్ మొదలైతే పొలాల్లోనే..
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- పేదరికంతో బడికి పంపలేని స్థితిలో నిరుపేదలు



కొండాపురంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో (ఫైల్)

కేటీదొడ్డి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలంతా బడికి వెళ్లి చదువుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ మండలంలోని చాలా గ్రామాల్లో బడిఈడు పిల్లలంతా బడిలో కాకుండా పొలం పనులు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులుగానూ వివిధ పనుల్లో మగ్గుతూ ఉన్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలు వివిధ కారణాలతో చదువుకు దూరం అవుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కూడా సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినా ఫలితం శూన్యమే. మండలంలోని కేటీదొడ్డి, నందిన్నె, గువ్వలదిన్నె, కొండాపురం, వెంకటాపురం, ఇర్కిచేడు, పాగుంట, కుచినెర్ల, మల్లాపురం, మల్లాపురం తండా తదితర గ్రామాల్లో బడి ఈడు పిల్లలు పత్తిపొలాల్లో పనులు చేస్తున్నారు. ప్రతీ ఏడాది సీడ్‌పత్తి సీజన్ మొదలైతే విద్యార్థులను తమ తల్లిదండ్రులు బడి మాన్పించి పత్తి పొలాల్లో పనులకు పంపుతున్నారు. అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు, పనిలో పెట్టుకుంటున్న యజమానులకు అవగాహన కల్పిస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారిలో మార్పు రావడం లేదు. కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు నిరక్షరాస్యత వల్ల అవగాహన లేక తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. మండలంలో ప్రతీ సంవత్సరం దాదాపు 300 మంది వరకు బడిఈడు పిల్లలందరూ నిత్యం వివిధ రకాల కూలీ పనులకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పిల్లలను పనుల్లో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తీసుకొని బడిఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

బడిబయట పిల్లలపై ప్రత్యేక దృష్టి

బడిబయట పిల్లలందరిని పాఠశాలకు పంపించేందుకు వారి తల్లిదండ్రులకు అవగా హన కల్పిస్తున్నాం. ఉపాధ్యాయులు పత్తి పొలాల వెంబడి తిరిగి బాలికల తల్లిదండ్రు లకు చదువు విలువ గురించి తెలియజేస్తు న్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకునేవారిపై చర్యలు తీసుకొని బడిబయట ఉన్న పిల్లలను పూర్తిస్థాయిలో బడికి వచ్చేల కృషి చేస్తాం.

- వెంకటేశ్వరరావు, మండల విద్యాధికారి

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు నిల్వ ఉన్నాయని, ఎవరైనా ఉద్దేశ్యపూర్వంగా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. బుధవారం వనపర్తి మునిసిపాలిటీలోని కిసాన్ మిత్ర ఫర్టిలైజర్ షాపును కలెక్టర్ తనిఖీ చేశారు. దుకాణాల బయట రాసిపెట్టిన ఎరువు నిల్వల ప్రకారం గోదాములో ఉన్న నిల్వలను పరిశీలించారు. ప్రతీ ఎరువుల దుకాణం ముందు ఎరువుల నిల్వ, ధరల సూచిక బోర్డు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారికి సూచించారు. ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు.

బీఆర్ఎస్‌ను వీడం..

» సీనియర్ నాయకుడు పోకల మనోహర్

6

అంతర్మథనం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఒకవేళ పొత్తు ఉంటే బీజేపీ అడిగే స్థానాల్లో కొల్లాపూర్ ఉంటుందని అంటున్నారు. తర్వాత కల్వకుర్తి నియోజకవర్గంలో ఆచారి బీజేపీ నుంచి అలుపెరగని యోధుడులా పోటీ చేస్తున్నారు. పొత్తు విషయం వస్తే మొదట అడిగే సీటు కూడా ఇదే. దీంతోపాటు గద్వాల, మక్తల్ లేదా నారాయణపేటలో ఒకటి, మహబూబ్‌నగర్ బీజేపీ అడగడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే షాద్‌నగర్ కూడా కోరవచ్చు. మొత్తం 14 స్థానాలు ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆరు స్థానాల వరకు బీజేపీ కచ్చితంగా వదులుకోదనే చర్చ నడుస్తోంది. అసలు పొత్తు విషయమే ఊహాగానం అయినప్పటికీ పొత్తు పెట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా కవిత వ్యతిరేక గళం, బాలరాజు వ్యాఖ్యలు వంటి పరిణామాలు చోటుచేసుకోవు కదా అని ముక్తాయిస్తున్నారు.

బలంగా బీఆర్ఎస్ కేడర్..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు దక్కకపోయినా బీఆర్ఎస్ ఇప్పటికీ క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నదనేది సుస్పష్టం. ఉద్యమ కాలం మొదలుకొని పదేళ్ల ప్రభుత్వం ఉండటంతో పార్టీకి సాధానాసంపత్తి, నాయకత్వ సమస్య పెద్దగా లేదనే చెప్పాలి. బాధ్యతలు అప్పగిస్తే పనిచేయడానికి చాలామంది పోటీపడుతున్నారు. కిందివరకు నమ్మకమైన కేడర్ ఉండగా తాజా గడ్డు పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పొత్తు లేదా విలీనం చేయదనే అభిప్రాయం కూడా వస్తోంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఒక ముఖ్యనేత తెలిపారు. ఈ ఎన్నికల ద్వారా తిరిగి బలోపేతం కావాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెండో స్థానంలో ఉండగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో ఓటు బ్యాంకు విషయంలో నిలిచాయి. ఎలాగూ జమిలి ఎన్నికల అంశంపై కేంద్రం ఆలోచన చేస్తుండటం, జనగణన తర్వాత నియోజకవర్గాల పెంపు ఉండటం, పొత్తు జరిగినా పెద్దగా చిక్కులు లేకుండా టిక్కెట్ల కేటాయింపులు చేసుకొని ముందుకువెళ్తే ఎంపీల విషయంలో బీజేపీ ఓటుబ్యాంకు, ఎమ్మెల్యేల విషయంలో రాష్ట్ర కోణంలో బీఆర్ఎస్ ఓటుబ్యాంకు ద్వారా మంచి ఫలితాలు ఉండవచ్చనే భావన కూడా వస్తోంది. ప్రస్తుత స్థితిలో పొత్తు విషయంలో నిర్దిష్ట నిర్ణయం వెలువడే అవకాశం లేదు. ఎన్నికల నాటివరకు ఈ చర్చ జరుగుతూనే ఉంటుంది.

రహదారిపై ఇలా ఆగితే ఎలా..?



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి నడిరోడ్డుపై నిలిపిన లారీలు

అసలే జాతీయ రహదారి.. అందునా నిత్యం వాహనాల రద్దీగా తిరిగే ప్రాంతం.. అలాంటి రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు శివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఏపీ తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో నిత్యం వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. బుధవారం కర్నూలు వెళ్లే మార్గంలో భారీ వాహనాలు (లారీలు) నిలిచిఉండటం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ప్రతీ రోజు సాయంత్రం అయిందంటే రోడ్లపైనే నిలుపుతున్నారని, దీని వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోయారు

- అలంపూరుచౌరస్తా, (ఆంధ్రజ్యోతి)

మెడికల్ అసోసియేషన్ ఏజెన్సీ తనిఖీ

» 15 రోజుల పాటు సస్పెన్షన్ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్



గద్వాలలో మెడికల్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్

గద్వాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ఆర్ఎంపీ డాక్టర్లకు మెడికల్ అసోసియేషన్ నుంచి మందులను విక్రయిస్తుండటంతో మెడికల్ అసోసియేషన్ ఏజెన్సీని 15 రోజులు సస్పెండ్ చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం మాలిక్ అండ్ మెడికల్ సర్జికల్ ఏజెన్సీని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనుమతి లేని ఆర్ఎంపీలకు మందులు ఇస్తున్నట్లు రుజువు కావడంతో 15 రోజుల పాటు సస్పెండ్ చేశారు. తదుపరి ఇన్వెస్టిగేషన్ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తనిఖీ నిర్వహిస్తున్న సమీపంలోనే ఎల్కూరు, నాగల్‌దిన్నెకు సంబంధించిన ఆర్ఎంపీలు కూడా మందుల ఆర్డర్‌కై ఫోన్‌చేయడం కొసమెరుపు.

180 గ్రాముల గంజాయి పట్టివేత

» ఐఐటీ పూర్వ విద్యార్థి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ తిరుపతిలాల్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయికి బానిసైన ఐఐటీ పూర్వ విద్యార్థి, నెలకు రూ.3 లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాడు. గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తూ, ఇతరులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులు సీఐ శారద, ఎస్ఐ దేవులపల్లి కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని దొంతి కుంట తండా బస్టాప్ వద్ద మంగళవారం సాయంత్రం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన పాత్లావత్ తిరుపతిలాల్ కారును సోదా చేయగా, 180 గ్రాముల గంజాయి లభించింది. కారుతో పాటు, తిరుపతిలాల్‌ను అదుపులోకి తీసుకొని, బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు ముంబై ఐఐటీలో చదువుకున్నాడని, మత్తుకు అలవాటు పడి నెలకు రూ. 3 లక్షలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసినట్లు గుర్తించామని ఎస్ఐ దేవుల పల్లి కృష్ణ తెలిపారు. గంజాయికి బానిసగా మారిన తిరుపతి లాల్ తల్లిదండ్రులను తరచుగా కొట్టడంతో వారు ఇల్లు వదిలి వెళ్లిపోయినట్లు చెప్పారు. నిందితుడు హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేసి తాగడంతో పాటు, యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇంటి ఆవరణలో సిగరెట్లు, గంజాయి పొడి కనిపించాయని, దుస్తులు చిందరగా పడి ఉన్నాయన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

గద్వాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి కాలనీలో మంగళవారం అర్ధరాత్రి మహాలక్ష్మి(30) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మహాలక్ష్మి గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి కడుపునొప్పి ఎక్కువ కావడంతో మనస్తాపంతో గుడిసెలో ఉన్న కడ్డీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. అయితే స్థానికులు మాత్రం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నదని, గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తగాదాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఒక కుమారుడు, నలుగురు కూతుర్లు ఉన్నారు. మృతురాలి తండ్రి రంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అపరిశుభ్రతపై జడ్పీ సీఈవో ఆగ్రహం



పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీ సీఈవో వెంకటరెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీ, మండలంలోని పలు ప్రాంతాల్లో జడ్పీ సీఈవో వెంకటరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మునిసిపాలిటీలోని ఆలూరు రోడ్డులో ఉన్న బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం ఉండాలన్నారు. బాత్‌రూంల నిర్వహణ బాగా లేదన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో జాగ్రత్త వహించాలన్నారు. మండలంలోని చిట్టబోయినపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. బూర్గుపల్లి గ్రామంలో డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కళాశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఎల్‌పీవో సరోజ, జడ్చర్ల అర్బన్, గంగాపూర్ ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాల అధికారులు డాక్టర్ మణిప్రియ, డాక్టర్ ప్రతాప్‌చౌహాన్ పాల్గొన్నారు.

అటవీ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయం ప్రారంభం


» అటవీ క్యాంప్‌లోనే ఎఫ్‌డీ ఆఫీస్



మన్ననూరు ఎఫ్‌డీ కార్యాలయం ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీ డాక్టర్ సునీల్ హిరేమత్

మన్ననూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ పులుల అభయారణ్యం(ఏటీఆర్) అటవీ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయాన్ని ఎఫ్‌డీ డాక్టర్ సునీల్ హిరేమత్ బుధవారం ప్రారంభించారు. అమ్రాబాద్, నాగార్జున సాగర్ డివిజన్ల పరిధిలో ఈ కార్యాలయం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అమ్రాబాద్‌కు మంజూరైన చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయాన్ని అచ్చంపేటలో ఏర్పాటు చేశారు. నల్లమలకు కేంద్రమైన మన్ననూరు అటవీ అతిథి గృహంలో కార్యాలయ నిర్వహణకు ఏర్పాట్లు చేయగా, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ఎఫ్‌డీ చాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అటవీ అధికారులు ఎఫ్‌డీని శాలువాతో సన్మానించారు. అనంతరం అమ్రాబాద్ అభయారణ్యంలో చేపట్టాల్సిన వన్యప్రాణుల సంరక్షణ, అడవుల అభివృద్ధిపై అధికారులతో ఎఫ్‌డీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రాంమోహన్, అటవీ రేంజ్ అధికారులు వీరేష్, గురుప్రసాద్, ఈశ్వర్, దేవరాజ్, సెక్షన్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో పవిత్రోత్సవాల్లో అర్చకులు, భక్తులు

చిన్నచింతకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం శ్రావణమాసం సందర్భంగా పవిత్రోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. కాగా, ఉదయం నుంచి యాగశాల మండపాలంకరణ, విశ్వక్సేనారాధన, పుణ్యావచనం, అంకురారోహణం, సాయంత్రం లక్ష్మీ అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

» సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేద, ధనిక అనే అంతరాలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యమని జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సీపీఐ 23వ జిల్లా మహాసభలకు బుధవారం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.బాలనరసింహతో కలిసి హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారని, నేడు అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి చేయలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై బీజేపీ కావాలని నాన్చుడు ధోరణి అవలంబిస్తోందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ బీసీల రిజర్వేషన్‌పై చేస్తున్న ఆందోళనకు సీపీఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు సభ ప్రారంభ సూచికగా జెండావిష్కరణ చేశారు. జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, నాగర్‌కర్నూల్ కార్యదర్శి ఎండీ ఫయాజ్, పరమేశ్‌గౌడ్, కె.రాము, పి.సరేష్, కృష్ణయాదవ్, అల్వాల్‌రెడ్డి, గోవర్ధన్, మహిళా నాయకురాలు భార్గవి, పద్మ, మహేష్, ఎండీ కలీం, ఎండీ మన్సూర్, రాజు, శంకర్, అమరజ్యోతి, శ్రీను, ప్రజానాట్యమండలి నాయకులు టి.మల్లయ్య, పర్వతాలు, శివ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడం..



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోకల మనోహర్

» సీనియర్ నాయకుడు పోకల మనోహర్

అచ్చంపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసిన బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని సీనియర్ నాయకుడు పోకల మనోహర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొని మాట్లాడారు.

పార్టీ మారుతున్న సంగతి ముందుగా కార్యకర్తలతో చర్చించి అభిప్రాయాలు తీసుకొని ఉంటే బాగుడేందన్నారు. కానీ తాను ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకోవడం పట్ల అతని వెంబడి ఎవరూ పోయేది లేదన్నారు. ఒక నాయకుడు పోతే మరొక నాయకుడు వస్తారని పేర్కొన్నారు. ఈనెల 10లోపు అచ్చంపేటకు కేటీఆర్ లేదా హరీశ్‌రావు వచ్చి ఇన్‌చార్జిని నియమిస్తారని ఈ సందర్భంగా పోకల మనోహర్ పేర్కొన్నారు. ఏ నాయకుడు కార్యకర్త పార్టీని వీడాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, సీనియర్ నాయకులు మాకం తిరుపతయ్య, కేటీ తిరుపయ్య, మాజీ ఎంపీపీ పర్వతాలు, సింగిల్‌విండో చైర్మన్ రాజురెడ్డి, రవీందర్ రావు, గోపాల్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూమి స్వభావం బట్టి పంటలు సాగు చేయాలి

» పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ పుష్పావతి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ పుష్పావతి

తాడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు భూమి స్వభావ పరీక్షలు నిర్వహించుకుని అందుకనుగుణంగా పంటలు సాగు చేసినట్లయితే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ పుష్పావతి అన్నారు. మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో బుధవారం రైతులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం వ్యవసాయ కళాశాల పాలెం ఆధ్వర్యంలో తుమ్మల సూగురు గ్రామాన్ని దత్తత తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు సాగు చేసే పంటలతో పాటు వాటి సరళి, సమగ్ర వ్యవసాయం, కూరగాయల పెంపకం, కిచెన్ గార్డెనింగ్ వంటి పద్ధతులకు తోడుగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి మంచి దిగుబడులు పొందేందుకే దత్తత తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రైతులను సమాయత్తపరుస్తామన్నారు. ఈ సందర్భంగా దత్తత ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన తాడూరు సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. గ్రామంలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న కూలీల కొరతను తగ్గించుకుని అన్నదాతలను యాంత్రీకరణ పద్ధతుల వైపు ముందుకు నడిపించాల్సిందిగా కోరారు. ప్రొఫెసర్ ఆగ్రోనేమి, డాక్టర్ సీహెచ్ ప్రతికుమారి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ బలరాం, డాక్టర్ నాగస్వామి, డాక్టర్ భానుశ్రీ, వ్యవసాయ అధికారి సందీప్, వ్యవసాయ విస్తరణాధికారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

» జిల్లా అధికారులకు మొరపెట్టుకున్న నిర్వాసితులు



నిర్వాసిత కుటుంబాలతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కొల్లాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నిర్మాణంలో సర్వం కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కొల్లాపూర్ మండలానికి చెందిన నిర్వాసితులు డిమాండ్ చేశారు. బుధవారం కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ ముడావత్ హన్మంత్ నాయక్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో వారు సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో కొల్లాపూర్ మండలంలోని బోడబండ తండా గ్రామ పరిధిలోని అంజనగిరి, సున్నపుతండా, వడ్డె గుడిసెలు, గ్రామాల్లోని రైతులు భూములు, ఇళ్లు, ఇంటి స్థలాలను కోల్పోయారని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ మహబూబ్ నగర్ ఆర్ అండ్‌ఆర్ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్ నాయక్, కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు ఇతర అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. నష్టపోయిన రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద 199, 118 ఇళ్లకు తక్షణమే నష్టపరిహారం ఇచ్చేలా చూస్తామని అధికారులు నిర్వాసితులకు హామీ ఇచ్చారు. తక్షణమే నిర్వాసితులకు సంబంధించిన వివరాలను సమకూర్చి త్వరలోనే మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశమై ఈ సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెప్పినట్లు నిర్వాసితులు తెలిపారు. నిర్వాసితులు బాలయ్య, సీతారాంనాయక్, నాయకుడు కేతావత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీకు దమ్ముంటే కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయండి

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో ధర్నా చేయడం కాదు.. మీకు దమ్ముంటే కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆమె బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో చేపట్టిన కాంగ్రెస్ బీసీ ధర్నాపై బుధవారం ఆమె పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేక బీజేపీని బదునాం చేస్తమంటే ఊరుకునేది లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అవి పూర్తిగా బీసీలకే ఇవ్వలన్నారు. ఇందులో 10శాతం ముస్లిం మైనార్టీలకు ఇస్తామనడం బీసీలకు మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి కాంగ్రెస్ ఇలాంటివి జిమ్మిక్కులు చేయడం అలవాటుగా మారిందన్నారు. బీసీలకు కాంగ్రెస్ ముందు నుంచి వ్యతిరేక మేనని అన్నారు. బీసీ ఓటు బ్యాంకును రాజకీయంగా వాడుకున్నది కాంగ్రెస్ అని అన్నారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. ఓడిపోతామన్న భయంతోనే ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ఇచ్చిన ఆరు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అవి అమలు చేయకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. తెలంగాణలో బీసీలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదన్నారు.

సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

» పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీ అకడమిక్ బ్లాక్‌లోని వాణిజ్యశాస్త్రం విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో కామర్స్ విద్యార్థులకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదడానికి ఉపయోగపడుతుందని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ నాగం కుమారస్వామి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అనురాధ రెడ్డి, ఎంఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, వాణిజ్యశాస్త్ర విభాగధిపతి డాక్టర్ రాజ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైగౌడ్ హక్కుల ఉద్యమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్ గౌడ్



అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన నోముల సురేష్‌గౌడ్ హక్కుల ఉద్యమం రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

అమ్రాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జై గౌడ్ హక్కుల ఉద్యమం రాష్ట్ర కార్యదర్శిగా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన నోముల సురేష్ గౌడ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్ బుధవారం నాగర్‌కర్నూల్‌లో నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన సొరకాయల శ్రీనివాస్ గౌడ్, మడ్డి హరీష్ గౌడ్‌లను హక్కుల ఉద్యమం జిల్లా కమిటీలో తీసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధన కోసం జైగౌడ్ హక్కుల ఉద్యమం పనిచేస్తుందని అన్నారు. హక్కుల ఉద్యమంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో సురేష్ గౌడ్ ఆ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

2డే లీగ్‌లో రాణించిన జిల్లా బౌలర్లు

» ముఖీద్ 2, జశ్వంత్‌కు 2 వికెట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న (హెచ్‌సీఏ) 2డే లీగ్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు రాణించారు. హైదరాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో ఉన్న శ్రీలహరీ క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన చీర్‌ఫుల్ జట్టు 48.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. జట్టులో శివ అర్ధసెంచరీతో 68 పరుగులు చేశాడు. జిల్లా బౌలర్లలో ముఖీద్, జశ్వంత్ చెరో 2 వికెట్లు, అక్షయ్ 1 వికెట్ తీశారు. వారిని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం. రాజశేఖర్ అభినందించారు.

చేనేతకు చెదరని ఆదరణ



అరు గ్యారెంటీల లోగోతో పాటు తెలంగాణ మ్యాప్, సీఎం చిత్రపటంతో మగ్గంపై సిద్ధం అవుతున్న పట్టు వస్త్రం

పట్టు శాలువాపై 'ఆరు గ్యారెంటీలు'

- తెలంగాణ మ్యాప్, సీఎం రేవంత్ చిత్రం కూడా...
- 'పేట' చేనేత కార్మికుడు ఆంజనేయులు కళానైపుణ్యం
- కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి ఎంపిక
- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు



చేనేత కార్మికుడు యంగలి అంజనేయులు

నారాయణపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట చేనేత కళకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. నారాయణపేట మండలంలోని కోటకొండకు చెందిన నేత కార్మికుడు యంగలి అంజనేయులు తన కళానైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన తన సోదరుడు యంగలి రఘురాములు నేతృత్వంలో, రూ.17 వేల వ్యయంతో, మగ్గంపై 20 రోజులు శ్రమించి అద్భుతమైన వస్త్ర విశేషాన్ని సృష్టించాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో పాటు, తెలంగాణ మ్యాప్‌ను, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటంతో కూడిన పట్టు శాలువాను నేసి తన ప్రత్యేకను, కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. అందుకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనను కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి ఎంపిక చేసింది. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్య మంత్రి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను చేనేత కార్మిక సంఘం నాయకులు కెంచి శ్రీనివాసులు, రఘురాములు అభినందించారు.

కుట్టులేని జాతీయ పతాకం

యంగలి ఆంజనేయులు పెదనాన్న యంగలి వెంకట్రాములు గతంలో చేనేత మగ్గంపై కుట్టులేని జాతీయ పతాకాన్ని రూపొందించారు. దానిని అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అలాగే కుట్టు లేని పట్టు చొక్కాను అప్పటి ప్రధాని వాజపేయి హయాంలో రూపొందించి అప్పటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయకు బహూకరించారు. వారి స్ఫూర్తితో అంజనేయులు కూడా ఆరు గ్యారెంటీల లోగో, తెలంగాణ మ్యాప్, సీఎం రేవంత్ చిత్రపటంతో పట్టు వస్త్రాన్ని నేసి ప్రతిభను చాటుకు న్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ శాలువాను ముఖ్యమం త్రికి బహూకరించనున్నారు.

- టెంపుల్ బార్డర్ నారాయణ పేట ప్రత్యేకం
- పట్టు చీరలకు పెట్టింది పేరు గద్వాల
- మగువల మనసు దోచే నేత వస్త్రాలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

నారాయణపేట/ గద్వాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాషన్లు మారుతున్నా, ఆధునిక వస్త్ర ధారణకు మహిళలు, యువతులు ప్రాధాన్యం ఇస్తున్నా, చేనేత పట్టు, కాటన్ చీరలకు మాత్రం ఆదరణ చెక్కు చెదరలేదు. ఇలాంటి పట్టు, కాటన్ చేనేత చీరలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, గద్వాల జిల్లాలు ప్రఖ్యాతిగాంచాయి. నారాయణపేట చేనేత కార్మికులు తమ కళానైపుణ్యంతో రూపొందించిన పట్టు, కాటన్ చీరలు మగువల మనసును దోచుకుంటున్నాయి. 124 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నారాయణపేట చేనేత కార్మికులు టెంపుల్ బార్డర్‌తో రూపొందించే పట్టు, చేనేత చీరలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఈ టెంపుల్ బార్డర్‌కు తొమ్మిదేళ్ల క్రితం పెటెంట్ హక్కు కూడా లభించింది. మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ కూడా పేట పట్టు చీరను కట్టుకున్న వారిలో ఉన్నారు. నారాయణపేట మండలం కోటకొండకు చెందిన చేనేత కార్మికుడు యంగలి వెంకట్రాములు మగ్గంపై కుట్టులేని జాతీయ పతాకాన్ని నేసి, అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఇక్కడి నేత కార్మికులు నేసే పట్టు చీరల్లో రుద్రాక్ష, కోటకొమ్మ, టెంపుల్ బార్డర్ ప్రత్యేకం. వీటితో పాటు ఆధునిక యువతుల అభిరుచికి తగ్గట్లుగా నివాళి ధనవతి, ప్లేన్, నివాళి దనవతి కడ్డి, శంభు ప్లేన్, శంబు కడ్డి, నిపాణి ప్లేన్ బార్డర్లతో చీరలను తయారు చేసి, మార్కెట్లో పోటీ పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి పుణే, ముబై, సాంగ్లీ, షోలాపూర్, గుల్బర్గా, యాద్గీర్, నాగ్‌పూర్, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాలకు పట్టు, కాటన్ చీరలు ఎగుమతి అవుతుంటాయి. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 5 వేల మంది చేనేత కార్మికులున్నారు. గత ప్రభుత్వం 735 మగ్గాలకు జీయో ట్యాగింగ్ చేసింది.



నారాయణపేటలో చీర నేస్తున్న కార్మికురాలు

గద్వాల జరీకి అంతర్జాతీయ గుర్తింపు

గద్వాల చేనేత జరీ చీరలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. సంస్కృతి సంప్రదాయాలకు గద్వాల చీర బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందింది. గద్వాల జరీ చీరలను కాటన్‌బాడీ, బార్డర్, కొంగులో చిలుకు (జరీ) కలిపి తయారు చేస్తారు. అందుకే గద్వాల జరీ చీరలకు భౌగోళిక గుర్తింపు లభించింది. అయితే గత పదేళ్ల నుంచి గద్వాల జరీ చీరలు మార్కెట్ సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. మహిళల అభిరుచులు మారిపోవడం, తక్కువ బరువున్న చీరలకు ప్రాధాన్యం పెరగడం, ఆధునిక డిజైన్లున్న చీరలవైపు మహిళలు మొగ్గు చూపుతుండటం కొంత ఇబ్బందిగా మారింది. అయినా లెనిన్, జ్యూట్, టస్సర్ వంటి వివిధ రకాల చిలుకుతో తయారు చేస్తున్న జరీ చీరలకు డిమాండ్ బాగానే ఉంది. మాస్టర్ వీవర్స్ కూడా పవర్ లూమ్‌లో తయారైన చీరలను, గద్వాల జరీ చీరలుగా విక్రయిస్తుండటం ప్రధాన సమస్యగా ఉంది. దీంతో ఇక్కడి కార్మికులకు ఉపాధి లభించడం కష్టంగా మారింది.



పేట టెంపుల్ బార్డర్ చీరలు

10 వేల మంది చేనేత కార్మికులు

గద్వాల పట్టణంలో దాదాపు 320 జియో ట్యాగింగ్ మగ్గాలున్నాయి. గట్టు, మాచర్ల, ఆరిగిద్ద, అయిజ, రాజపోలి, ఎక్లాస్‌పూర్, గొర్లఖాన్‌దొడ్డి, అనంతపూర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 3,400 జియో మగ్గాలుండగా, ట్యాంగింగ్ లేని మగ్గాలు 600 వరకు ఉన్నాయి. దాదాపు 10 వేల మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారిని ప్రోత్సహించి, వృత్తికి భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ డెవలప్‌మెంట్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో వీవర్ సర్వీసింగ్ సెంటర్ ద్వారా సబ్సిడీపై జుకార్డ్స్ ఎలక్ట్రానిక్ యంత్రాలను అందిస్తోంది. ప్రస్తుతం గద్వాలకు ఎనిమిది యంత్రాలను అందించింది. దీని ద్వారా ఎక్కువ డిజైన్లతో జరీ చీరలను నేసే అవకాశం లభించింది. కార్మికులందరికీ వీటిని అందిస్తే గద్వాల చేనేతలు పునర్వైభవం సంతరించుకునే అవకాశం ఉంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చేనేత కార్మికుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. నేత కార్మికులను ప్రోత్సహించేందుకు చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నాం. కార్మికులు వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకుని ముందుకు సాగాలి.

- గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు

నేతన్నలకు అండగా ప్రభుత్వం

- పలు సంక్షేమ పథకాలతో భరోసా
- మారుతున్న కార్మికుల స్థితిగతులు

అమరచింత, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో మారుతున్న ప్రజల అభిరుచి, జీవన శైలి నేపథ్యంలో చేనేత రంగం ఒడిదుడుకులకు గురవుతోంది. ఈ తరుణంలో కష్టనష్టాలను ఓర్చుకొని చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులను భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. చేనేత పరిశ్రమ అభివృద్ధి, నేత కళాకారుల నైపుణ్యాల పెంపు, వృత్తి జీవితం సజావుగా సాగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. తద్వారా వారి జీవన గాడిన పడుతోంది.

ఆదుకుంటున్న పథకాలు

చేనేత కార్మికుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేనేత భరోసా, చేనేతకు చేయూత, చేనేత బీమా, చేనేత ఆసరా, చేనేత మిత్ర తదితర పథకాలను అమలు చేస్తోంది. నేత కార్మికులు లక్ష రూపాయల లోపు తీసుకున్న రుణాలను చేనేత భరోసా ద్వారా మాఫీ చేసింది. అలాగే జియో ట్యాగ్ మగ్గం ఉన్న కార్మికుడితో పాటు, ఇద్దరు సహాయకులకు 'చేనేతకు చేయూత' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద వారు కట్టిన డబ్బుకు రెండు రెట్లు ఎక్కువగా అందిస్తోంది. వారికి ప్రత్యేక బీమా పథకాన్ని కూడా అమలు చేస్తోంది. చేనేత కార్మికుడు మృతి చెందినట్లయితే వారి కుటుంబానికి రూ. 5 లక్షల రూపాయలు అందిస్తోంది. దీంతో పాటు 45 సంవత్సరాల పైబడిన నేత కార్మికులందరికీ ఆసరా పింఛన్లను ఇస్తోంది. చేనేత మిత్ర పథకం ద్వారా నూలు, రేషం, రంగులు తదితర ముడి సరుకులకు సబ్సిడీ అమలు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జోగుళాంబ గద్వాల, నారాయణపేట, అమరచింత, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో 6 వేలకు పైగా జియో ట్యాగ్ ఉన్న మగ్గాలున్నాయి. దాదాపు 11 వేల మంది నేత కార్మికులు ఉన్నారు.

పురస్కారాలతో నేతన్నలకు ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరున పురస్కారాలు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ప్రోత్సహిస్తోంది. చీర నేతలో నైపుణ్యం, డిజైనింగ్, కలర్, కొంగు, అంచులు తదితర విభాగాల్లో ప్రతిభావంతులైన కార్మికులను పురస్కారానికి ఎంపిక చేస్తోంది.



మగ్గంపై నేత పనిలో నిమగ్నమైన కార్మికులు

ప్రతీ సంవత్సరం ఆగస్టు 7వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్ర భారతిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆ పురస్కారాలను అందిస్తోంది. పురస్కారానికి ఎంపికైన నేతన్నలకు షీల్డ్‌తో పాటు రూ. 25 వేలు అందించి సత్కరిస్తోంది. అలాగే ఎంపికైన కార్మికుల్లో 65 ఏళ్లు పైబడిన వారికి ప్రతీ నెల రూ. 8 వేల పెన్షన్ ఇస్తోంది.



అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీలో మగ్గాలు

పురస్కారానికి ఎంపికైన 8 మంది



మాదుగుండు లక్ష్మి, గొర్లఖాన్‌దొడ్డి గ్రామం



సూర్య వెంకటేష్, రాజోలి గ్రామం



ఆంజనేయులు, చిన్నజట్రం గ్రామం



దేవరకొండ లచ్చన్న, అమరచింత గ్రామం



శీలం బుడ్డన్న, తిప్పడంపల్లి గ్రామం



తిరుమల సులోచన , అమరచింత



సారంగి రాములు , కొత్తకోట మండలం

నారాయణపేట/ అమరచింత/ గద్వాల/ రాజోలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి ఉమ్మడి జిల్లా నుంచి 8 మంది నేత కార్మికులు ఎంపికయ్యారు. వారిలో నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు, వనపర్తి జిల్లా నుంచి నలుగురు, జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ఇద్దరు ఉన్నారు. నారాయణపేట జిల్లాకు చెందిన యంగలి ఆంజనేయులు డిజైనింగ్ విభాగంలో, చిన్నజట్రం గ్రామానికి చెందిన ఆంజనేయులుకు మిక్స్‌డ్ ఫ్యాబ్రిక్ నేత విభాగంలో అవార్డు అందుకోనున్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలికి చెందిన సూర్య వెంకటేశ్ రెండు రంగుల నూలు దారాలు, జాకార్డ్ బార్డర్, అంచులకు మీన బుట్టలు, కంగుకు అంచుపట్టీతో కాటన్ చీర తయారు చేసి అవార్డుకు ఎంపికయ్యారు. గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మాదుగుండ లక్ష్మి టర్నింగ్ బార్డర్‌లో మీన బుట్ట, చీరకు ఒక వైపు చిన్నది, మరో వైపు పెద్ద అంచులతో పట్టుచీర నేసి పురస్కారానికి ఎంపికయ్యారు.

● వనపర్తి జిల్లా, అమరచింతకు చెందిన మహంకాళి సులోచన అమేషా డీర్ బూటా బార్డర్‌తో చేర నేసి పురస్కారానికి ఎంపికయ్యారు. దేవరకొండ లచ్చన్న సైడ్ లూమ్ సిల్క్ శారీ రూపొందించి అవార్డు పొందారు. ఆత్మకూరు మండలం తిప్పడంపల్లికి చెందిన శీలా గుడ్డన్న కొమ్మ బూటా సైడ్ డిజైన్‌తో చీర నేసి అవార్డుకు ఎంపికయ్యారు. కొత్తకోటకు చెందిన సారంగి రాములు పికాక్, టెంపుల్ బార్డర్‌తో చీరను తయారుచేసి రాష్ట్రస్థాయిలో రాణించారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 6 (అంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకోల్ గ్రామ శివారులోని సింగోటం చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చని పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీశ్ తెలిపారు. గోధుమ రంగు అంగీ, బూడిద రంగు నైట్ ప్యాంట్, కుడి చేతికి రాగి కడియం, ఎడమ కాలికి నల్లని దారం ఉన్నాయని చెప్పారు. మృతుడు 5.6 ఎత్తు ఉన్నాడని, సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆనవాళ్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

కొల్లాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహిత తన సవతి (భర్త చిన్న భార్య) కొడుకు పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన తలారి రాముడు అదే గ్రామానికి చెందిన దేవమ్మ (సౌమ్య)ను కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత అతడు తన సమీప బంధువైన యువతితో ప్రేమాయణం నడిపాడు. ఆమె గర్భవతి కావడంతో వారి కుటుంబ సభ్యులు అతడికే ఇచ్చి వివాహం చేశారు. ఆ తర్వాత మొదటి భార్య దేవమ్మ బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఈ నెల 4న రెండవ భార్య కొడుకు పుట్టిన రోజు ఉండటంతో తలారి రాముడు హైదరాబాద్‌కు వెళ్లి 3వ తేదీన మొదటి భార్య దేవమ్మను గ్రామానికి తీసుకొచ్చాడు. మరుసటి రోజు సాయంత్రం పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అదే రోజు రాత్రి దేవమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేవమ్మ మృతిపై అనుమానాలున్నాయని పేర్కొంటూ బుధవారం ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇంటి తాళం విరగ్గొట్టి చోరీ

- 10 తులాల బంగారు నగలు మాయం

మహబూబ్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి వచ్చే లోపు దొంగలు చొరబడి దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో నివసించే లక్ష్మీనారాయణ ఈ నెల 3న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి తలుపులకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండటంతో కంగుతిన్నాడు. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని దాదాపు 10 తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

ఖిల్లాగణపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్ గ్రామంలో భార్యపై భర్త కర్రతో దాడి చేశాడు. ఎస్ఐ జె.నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంగనమోని నరేశ్, లావణ్య దంపతుల మధ్య మంగళవారం గొడవ జరిగింది. ఆ సమయంలో నరేశ్ తండ్రి గంగనమోని మల్లయ్య లావణ్యను దుర్భాషలాడుతూ చేతులతో కొట్టాడు. దీంతో ఆమె అతడిని ప్రశ్నిస్తుండగా, నరేశ్ ఆమెపై కర్రతో దాడి చేయడంతో తలపై తీవ్ర గాయమైంది. అనంతరం ఆమె వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని, బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గంగనమోని నరేశ్, మల్లయ్యలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టోల్‌ప్లాజా కార్మికులకు బోనస్ ఎగవేత

- ఉద్యోగులు, యాజమాన్యం మధ్య వివాదం
- పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై నున్న పుల్లూరు టోల్‌ప్లాజాలో ఉద్యోగులకు, కంపెనీ యాజమాన్యానికి మధ్య వివాదం నెలకొన్నది. శ్రీసాయి ఎంటర్ ప్రైజస్ ద్వారా 85 మంది కార్మికులు టోల్‌ప్లాజాలో పని చేస్తున్నారు. వారికి ప్రతీ నెల జీతంతో పాటు, ఏడాదికి ఒకసారి బోనస్ ఇవ్వాల్సి ఉంటుంది. గత జూన్‌లో ఉద్యోగులకు బోనస్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు చెల్లించలేదు. ఈ విషయంపై ఆదివారం సాయంత్రం వారు కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో టోల్ ప్లాజా గేట్లు ఎత్తేసి నిరసన తెలిపారు. దీంతో కంపెనీ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తమకు బోనస్ ఇవ్వడం లేదంటూ ఉద్యోగులందరూ కలిసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదులపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి

పాలమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెక్కొండ గ్రామ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడి నెక్కొండ గ్రామానికి చెందిన జ్యోతి (36) మృతి చెందింది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. బుధవారం ఉదయం 8.40 గంటలకు వరినాటు వేసేందుకు కూలికి వెళ్లిన బెల్లం జ్యోతి కొద్ది సమయం తరువాత 9 గంటలకు చెక్‌డ్యాంపై వెళ్తూ కాలు జారి పడింది. గమనించిన అదే గ్రామానికి చెందిన పూలదండ పాండు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. అక్కడికి వెళ్లి గాలిస్తే మధ్యాహ్నం 12.15 గంటలకు శవం దొరికింది. ఈ ఘటనపై మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కృష్ణ, గోదావరి నదీ జలాలను తెలంగాణకు దక్కకుండా కుట్ర

వనపర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గోదావరి నదీ జలాలను తెలంగాణకు దక్కకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మాజీ మంత్రి ఎస్. నిరంజన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ వనపర్తి జిల్లా కార్యాలయంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న పరిణామాలను జయశంకర్ గమనిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. అణువణువునా తెలంగాణ అభివృద్ధి కోసం జయశంకర్ పరితపించారని, రాష్ట్రంలో నేడు అడుగడుగునా ఆంధ్ర బానిసత్వం వర్ధిల్లుతోందని మండిపడ్డారు. పరోక్షంగా ఏపీ ప్రభుత్వం, ఆంధ్ర రాజకీయ నాయకులు తెలంగాణ రాజకీయాలను శాసిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక, నదీ ప్రయోజనాలు తెలంగాణకు దూరం చేసే దుర్మార్గపు పరిపాలన సాగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడ తెలంగాణ ప్రభుత్వం పేరిట ఉండే సర్కారు తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా గోదావరి నీళ్లను బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు తరలించే దుర్మార్గపు ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కట్టిన కాళేశ్వరం నుంచి నీళ్లు అందించి వినియోగించకుండా, అందుబాటులో ఉన్న నీళ్లను వినియోగించకుండా రాష్ట్ర ప్రభుత్వం కన్నీళ్లు పెట్టిస్తున్నదన్నారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణను సాకారం చేసే దిశగా కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలబెట్టారన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అగ్రభాగం నుంచి అట్టడుగుకు తీసుకువచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, నాగన్న యాదవ్, చిట్యాల రాము, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

పెద్దకొత్తపల్లి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని గంట్రావుపల్లిలో ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కదిరె రాముడు కుమార్తె మౌనిక (18) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై ఆమె తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఊర్కొండ, ఆగస్టు 6 (అంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని జకినాలపల్లిలో ఓ మహిళ అదృశ్యం అయ్యింది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహిళ (33) ఈ నెల 1న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికుడు

- గుర్తించి అప్పగించిన ఆర్టీసీ కంట్రోలర్



ప్రయాణికుడు శివశంకర్‌కు బ్యాగ్‌ను అప్పగిస్తున్న కంట్రోలర్ నిరంజన్

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రయాణికుడు బస్సులో విలువైన వస్తువులున్న బ్యాగ్‌ను మరచిపోయాడు. ఈ విషయాన్ని ఆర్టీసీ డిపో కంట్రోలర్‌కు చెప్పడంతో వారు దాన్ని గుర్తించి అతడికి అప్పగించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రానికి చెందిన శివశంకర్ బుధవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. విలువైన వస్తువులున్న తన బ్యాగ్‌ను మరచిపోయి పెద్దకొత్తపల్లిలో బస్సు దిగాడు. కొంత సేపటికి బ్యాగ్ గుర్తుకొచ్చి పెద్దకొత్తపల్లి కంట్రోలర్ నిరంజన్‌కు విషయాన్ని తెలిపాడు. దీంతో ఆయన కొల్లాపూర్ బస్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఆ ఎక్స్‌ప్రెస్ బస్సు కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో ఆగింది. బస్సులో ఉన్న బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకొని, గురువారం శివశంకర్‌కు అందించాడు.

ఇంటర్వ్యూ..

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● కేటీ.మల్లేశ్, ఎస్ఐ, గట్టు



గట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ లింకులను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని గట్టు ఎస్ఐ కేటీ.మల్లేశ్ మండల ప్రజలకు సూచించారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

మోసాలపై అవగాహన కల్పిస్తున్నారా?

కొంతకాలంగా రైతులను లక్ష్యంగా చేసుకుని పీఎం కిసాన్ యోజన పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటి గురించి మండలంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా?

నిత్యం మండలంలో కానిస్టేబుళ్లతో పాటు తాను కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. కొన్నిగ్రామాల్లో నిఘా కూడా ఏర్పాటు చేశాం.

గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయా?

ప్రస్తుతం మండలంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి. గ్రామాల్లో అనుమానితులపై నిఘా పెడుతూనే, ప్రజలను చైతన్యపరుస్తున్నాము.

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారా?

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రధానంగా యువకులు తాగుడుకు బానిసలు కావొద్దు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి.

మండల ప్రజలకు మీరిచ్చే సందేశం?

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి తాళం వేసి వెళుతున్నప్పుడు పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలి. అవసరమైతే పోలీసులను సంప్రదించాలి.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సివిల్ సప్లయ్ సిబ్బంది, హమాలీలు

మానవపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాంలో హమాలీగా పని చేస్తున్న మద్దిలేటి మూడు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నుంచి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే మండల రేషన్ డీలర్లు రూ.4వేలు అందించారు. ఉన్నతాధికారులు స్పందించి హమాలీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నగదును అందించిన వారిలో సురేశ్, రజాక్, రవి, అల్లిపీరా, రఫీ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

» అమరవాయిలో రెండు నెలలుగా గ్రామస్థుల అవస్థలు

మానవపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యతో రెండు నెలలుగా ఇబ్బందిపడుతున్నామని మండల పరిధిలోని అమరవాయి గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో రాఘవకు ఫిర్యాదు చేశారు. వాటర్ మ్యాన్‌కు, భగీరథ అధికారులకు సమస్యను తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోయారు. గ్రామంలో 1, 2 వార్డుల్లో సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఈవిషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఎంపీడీవో రాఘవ చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో అమరవాయి గ్రామస్థులు బజారి, శ్రీరాములు, సుంకన్న, భీముడు, రంగన్న, మోహన్, బాబు తదితరులు ఉన్నారు.

టీబీ లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేయించాలి

» హెచ్ఈవో రామకృష్ణ

రాజోలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టీబీ లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి హెచ్ఈపీ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం పీహెచ్‌సీలో టీబీవ్యాధి నిర్ధారణకై ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, వ్యాధి లక్షణాలు ఉన్న వారి గుర్తించి పరీక్షలు చేయించాలని ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో దస్తగిరి, వైద్య సిబ్బంది రంజిత్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బియ్యం పరిశీలన

ధరూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలుప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని బుధవారం ఎంపీడీవో మంజుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. సందేహం ఉంటే తప్పనిసరిగా ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేయాలని చెప్పారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వాప్నికుడు జయశంకర్

- ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి



గద్వాల కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



జిల్లా పోలీసు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పోలీసులు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. బుధవారం జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధననే శ్వాసగా, ఆశయంగా భావించి తన, జీవితాంతం తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు జయశంకర్ అన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి నుషిత, జిల్లా అధికారులు ఉన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

గద్వాల క్రైం : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగంచేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని, ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సతీష్‌కుమార్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ సంపత్, ఆర్ఐ వెంకటేశ్, ఎస్ఐలు షకూర్, తేజశ్విని, స్వాతి, అధికారులు ఉన్నారు.



అయిజలోని ఎమ్మార్సీ వద్ద జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గద్వాలలో జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బాసు హనుమంతునాయుడు

● గట్టు : తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● అయిజ: అయిజలోని ఎమ్మార్సీ భవనం ముందున్న విగ్రహానికి వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయమే పాఠశాలలకు వెళ్లే ముందు పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మానవపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీవో రాఘవ, సిబ్బంది పులమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, జయమ్మ, మహేశ్, శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్, మేరీ, రాధిక పాల్గొన్నారు.

● అలంపూర్: మండల కార్యాలయంలో తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర

గద్వాల న్యూటౌన్ : ప్రొఫసర్ జయశంకర్ సార్ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలన సాగిందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసుహనుమంతునాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హనుమంతునాయుడు నివాసంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి జయశంకర్ అండగా ఉండి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించాడన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చక్రధర్‌రావు, రాజు, శేఖర్‌నాయుడు, చక్రధర్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు, కామేష్, శ్రీరాములు, మౌర్యముని ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ బస్తీ దవాఖానను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలు ఎవరైనా వైద్యసేవల కోసం కర్నూల్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా చూడాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, తద్వారా ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వైద్యసిబ్బంది గర్భిణులలో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గమనించి తగిన జాగ్రత్తలు తెలియజెప్పాలని, సుఖ ప్రసవం జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఒకవేళ గర్భిణి వేరే ప్రాంతానికి వలస వెళ్లినపక్షంలో ఆ వలసకు సంబంధించి నివేదికను తయారు చేసి జాబితా రూపంలో అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సిద్దప్ప, డాక్టర్ మాధుర్య, వైద్యసిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



ధరూర్ జడ్పీహెచ్ఎస్‌లో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

● అదనపు కలెక్టర్ నర్సింగ రావు

ధరూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు అదనపు కలెక్టర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రత్నంసింహారెడ్డి మాట్లాడుతూ మా తాత నైబాయి మేఘారెడ్డి స్ఫూర్తితో సంస్థను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు సుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ నర్సింలు ఉన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

» ముస్లింల రిజర్వేషన్ల కోసమే ఢిల్లీలో ధర్నా

» విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గద్వాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో బీసీలకు 42శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని దానిని అమలు చేయకుండా బీసీలలో ముస్లింల జనాభాను కలిపి రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు విమర్శించారు. బుధవారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి బీసీలపై ప్రేమలేదని విమర్శించారు. బీసీలలో ముస్లింలను కలిపి బిల్లులు పంపితే ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఈ విషయం ప్రతీ బీసీకి తెలుసుని అన్నారు. బీసీల వ్యతిరేకి రేవంత్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నాడని బీసీ సమాజం గుర్తించిందని విమర్శించారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్నది బీసీల కోసం కాదని ముస్లింల కోసం ధర్నా చేస్తున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లు ప్రతిపాదనలో ముస్లింలను కలపకుండా బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తీర్మానం చేయాలని అప్పుడే బీజేపీ మద్దతు ఇస్తుందని బీసీ సమాజానికి మేలు జరుగుతుందని వివరించారు. బీజేపీకి బీసీలపై ప్రేమ ఉన్నందుకు అన్యాయం జరగకూడదని చూస్తున్నదన్నారు. బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఎంతోమంది సీఎంలకు, మంత్రులను చేసిన ఘనత బీజేపీకే ఉందని వివరించారు. తెలంగాణలో హిందువులను మైనార్టీలుగా చేయాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదని అన్నారు. 100 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేసి హిందువులను వెనుకబెట్టాలన్నదే వారి ఉద్దేశమన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీసీలు బుద్ధి చెప్పాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్ ఉన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన యూనిసెఫ్ బృందం

గట్టు, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని గట్టు, మాచర్ల, చాగదోణ, ఇందువాసిలోని పాఠశాలలను బుధవారం యూనిసెఫ్ బృందం సభ్యులు సందర్శించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. విద్యార్థులకు అందించే తాగునీరు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, వంటివాటిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. పలుఅంశాలను రికార్డు చేసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సభ్యులు నరసింహారెడ్డి, సైదులు, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు

» ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

గద్వాలసర్కిల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా పూల్లూరు జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ తోట శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎస్జీఎఫ్ కార్యదర్శిగా నియమితులైన శ్రీనివాసులు ఇన్‌చార్జి డీఈవోను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని శ్రీనివాసులు తెలిపారు. నూతన ఎస్జీఎఫ్‌ను డీవైఎస్వో జితేందర్, పీడీలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

నిబద్ధతకు మారుపేరు జయశంకర్

● ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి రాష్ట్రసాధన కోసం అవిశ్రాంత పోరు సాగించిన ఆచార్య జయశంకర్ నిబద్ధతకు మారుపేరని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా కీర్తించారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివంగత నేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో..

పట్టణంలోని బీసీస్టడీ సర్కిల్‌లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి డైరెక్టర్ రాములు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో జయశంకర్ పాత్రను గుర్తు చేసుకుని నివాళులర్పించారు.

భూ భారతి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

● తహసీల్దార్ల సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్‌హాలులో తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యూల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు. ఎంతమందికి నోటీసులు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్న మండలాల తహసీల్దార్లను, జాప్యానికి గల కారణాలపై ఆరా తీశారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినవన్నీ తక్షణమే డిస్పోజ్ చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, పీవోపీ, డీఎస్ లాంటి అన్ని పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దరఖాస్తు తిరస్కరణకు స్పష్టమైన కారణాలతో రికార్డు చేయాలన్నారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదికను సమర్పించాలన్నారు. మీ సేవా ద్వారా 2024 సంవత్సరం వరకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వారంలోగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో అలివేలు, సర్వేలాండ్ రికార్డు ఏడీ రాంచందర్, తహసీల్దార్లు ఉన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



104ప్యాకేజీ కాలువ నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతుకు సాగునీటిని అందించి ఆదుకుంటామని, చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టు కింద ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ చివరి ఆయకట్టు రైతులకు నీరందకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు బుధవారం కేటీదొడ్డి మండలంలోని 104 ప్యాకేజీ కాలువను రైతులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. 104ప్యాకేజీ ప్రధాన కాలువ కింద ఉన్న డీ9 కాలువ ఇర్కిచేడు, ఇర్కిచేడు తండా, ముసల్‌దొడ్డి గ్రామాలలో సాగునీరు అందడం లేదని రైతులు అన్నారు. డీ-9 కాలువ కింద 3వేల ఎకరాలల్లో పత్తి, వరి తదితర పంటలు కాలువ కింద సాగవుతున్నాయని కానీ ఆ పంటలకు సాగునీరు అందడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని రైతులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి రైతుకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ హన్మంతు, నాయకులు రాజశేఖర్, రాజేష్, చంద్రశేఖర్ ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

పిల్లలను తప్పకుండా బడికి పంపాలి

» ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి

రాజోలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పనికి పంపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని పెద్దతాండ్రపాడులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం ఆమె బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం 8వ తరగతి పూర్తయిన వారు 9వ తరగతి చదువుతున్నారా, లేక పనికి వెళ్తున్నారా చూడాలని, డ్రాప్ అవకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు చేయకూడదన్నారు. గ్రామంలో పొలం పనులకు వెళ్లిన మహిళలతో మాట్లాడారు. పిల్లలను పనికి పంపకూడదని, బడికే పంపాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ సంతోషమ్మ, ఐసీపీఎస్ పద్మ, డీహెచ్ఈడబ్ల్యూ చిట్టెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవగాహనతో వ్యవహరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువగా విద్యావంతులే సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని, సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మొగులయ్య అన్నారు. సైబర్ జాగరూకత దివస్ సందర్భంగా బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బులు పోయాక బాధపడటం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, అందరికీ తెలియజేయాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైనవారు వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ రెండవ ఎస్ఐ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, లెక్చరర్ శ్రీదేవి, సైబర్ వారియర్స్ రమేశ్, రాజు, విద్యార్థులు ఉన్నారు.

సుంకేసుల జలాశయానికి కొనసాగుతున్న వరద

రాజోలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీరు కొనసాగుతున్నది. గత కొన్ని రోజులుగా ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం ఉదయం డ్యాంకు 16,000 క్యూసెకుల నీరు వచ్చి చేరుకుంది. దీంతో సుంకేసుల జలాశయం నుంచి 4 గేట్లు ఒక మీటర్ ఎత్తుకు తెరిచి 19,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీ కాగా, ప్రస్తుతం 1.194 టీఎంసీలుగా ఉంది. ఇందులో నీటి నిల్వ 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.90 మీటర్లు నమోదు అయినట్లు డ్యాం జేఈ స్వామి తెలిపారు.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

ధరూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ర్యాలంపాడులో ఆర్అండ్ఆర్ (నూతన పునరావాస) సెంటర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచులు తిమ్మప్ప, అంపన్న, శ్రీనివాస్‌రెడ్డి, రంగన్నగౌడ్, బాలు, నర్సింహులు, రంగస్వామి, వెంకటేశ్, రాముడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోవెలదిన్నె- శాంతినగర్ రోడ్డును నిర్మించాలి



కోవెలదిన్నె రోడ్డులో నిలిచిన నీటిలో బీజేపీ నాయకుల నిరసన

● బీజేపీ నాయకుల డిమాండ్

వడ్డేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గుంతలమయమైన కోవెలదిన్నె-శాంతినగర్ రోడ్డును నిర్మించాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. వార్డుల పర్యటనలో భాగంగా బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు బోయ రామకృష్ణ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలో కర్నూల్ రోడ్డుకు ఆనుకున్ని కోవెలదిన్నె రోడ్డును నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోవెలదిన్నె రోడ్డుపై బడిపిల్లలు, విద్యార్థులు, ప్రజలు మోటార్‌సైకిల్లపై వెళుతున్న వారు జారి పడుతున్నారన్నారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 సమీపంలో ఉండటంతో ఈ రోడ్డు వెంట నిత్యం వందలాది బారీ వాహనాలు తిరుగుండటం, వర్షం కురిసి గుంతలు ఏర్పడిన ప్రతిసారి మోకాళ్ల లోతులో నీరు వచ్చి చేరుతుందన్నారు. మునిసిపాలిటీ అధికారులు స్పందించింఇచ సరిహద్దు వరకు బీటీ రోడ్డును వేయాలని కోరారు. ఈ రహదారిపై వర్షం నీరు నిలిచి ఉండటం వల్ల 9, 10వ వార్డు ప్రజలు నిత్యం డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందింఒచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో కోవెలదిన్నె రోడ్డు బురదలోనే ధర్నా చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మోహన్ యాదవ్, శేఖర్ ఆచారి, ఈశ్వర్, నరేష్, రాఘవేంద్ర, బోయహుస్సేన్, గోవర్ధన్, హరి, అయ్యరాజు ఉన్నారు.